మనమూ మనుష్యులమేనండి... మనకీ కోపాలు అసంతృప్తులు, అలజడులూ ఉంటాయి. కాని అక్కసుతో ఆవేశంగా అరుచుకుంటూ ఒకరినొకరు దూషిస్తూ నిందిస్తూ... పోట్లాడుకుంటుంటే ప్రశాంతత పోయి ప్రళయ వాతావరణం నెలకొంటుంది.

# నీ వ్యధ తెలిసీ

"చేతగాని వాళ్ళు చేతగానట్లు ఉండండి... ప్రతీ పనిలోనూ నేనున్నానంటూ దూరకండి..." ఒక్క విదిలింపు విదిలించింది పునీత. ముడుచుకుపోయాడు మాధవ్. అసలు పునీతేనా ఇలా మాట్లాడేది... ఈ విదిలింపులు ఈ చికాకులు రుసరుసలు... భుగభుగలు ఇరవైయేళ్ళ కాపురంలో ఎప్పుడూ లేదు. చేస్తున్న పని ఆపి గమ్మున వెళ్ళి మంచం పై పడుకున్నాడు.

ఎందుకో పునీత పునీతలా ప్రవర్తించడంలేదు. ఎందుకిలా... మార్పు నాలోనా తనలోనా అనుకున్నాడు అప్పటికి అరవయ్యోసారి.

"ఏంటి నాన్న అమ్మకి అంత కోపం పెరిగిపోయింది. ఇదివరకు ఎపుడైనా ఏమైనా వండిపెట్టమంటేచాలు ఎక్కడలేని ఓపిక తెచ్చుకుని వండిపెట్టేది, ఏదైనా చెయ్యమనడం ఆలస్యం వెంటనే చేసేది... ఇప్పుడు మాట మాట్లాడితే చాలు కస్సుమంటుంది... నీవేమైనా అన్నావా నాన్న అమ్మను..." అడిగింది వింధ్య.

విలవిలలాడిపోయాడు మాధవ్ "నేనేనాడైనా మీ అమ్మను కోప్పడగా చూశావా తల్లీ అమ్మకెందుకో వంట్లో బాగోనట్లుంది... రెండు రోజులైతే అదే సర్దుకుంటుంది... నువ్వేం ఆందోళనపడకు..."

"లేదు నాన్నా ఇప్పటికి పదిహేను రోజులుగా ఇదే తంతు... తమ్ముడినైతే చాలా గాయపడేటట్లుగా మాట్లాడిందట... అక్కా అమ్మేనా ఇలా మాట్లాడుతున్నది అని తెగ బాధపడిపోయాడు..."

"అవును వింధ్యా తమ్ముడి స్నేహితులతో నీ స్నేహితులతో ఇల్లెపుడూ సందడిగా ఉండేది అలాంటిది తమ్ముడు ఇక తన స్నేహితులను తీసుకురానని చెప్పేశాడు. ఓరోజు వాళ్ళముందే పాత్రలు ఎత్తేసి అరిచి గొడవ చేసిందట..."

"నాన్న మీరు భోంచేశారా..."

"లేదమ్మా... భోజనాల బల్ల సర్దుతుంటేనే ఒక రకం బదులు మరో రకం గిన్నెలు సర్దానంటూ ఇంతెత్తున అరిచింది. గమ్మున వచ్చి పడుకున్నాను..."

అమ్మానాన్న ఎంతో అన్యోన్యంగా వుంటారు. వీరి అన్యోన్యత గురించి బంధువుల్లో ఎంతో గొప్పగా చెప్పుకుంటారు... బంధువుల ఇంట ఏ శుభకార్యం జరిగినా వీరిద్దరిని ఎంతో గౌరవంగా మీ దంపతుల్లా మా పిల్లలూ కలకాలం కలిసుండాలని దీవించమంటారు... అలాంటి జంట ఇవాళ ఎడముఖం పెడముఖంగా ఉంటారని అనుకోలేదు... జాలిగా చూసింది తండ్రి వంక.

"పదనాన్న భోంచేద్దాం..." నాన్న చెయ్యి పట్టుకుని తీసుకువెళ్ళింది... పునీత అందరికి వడ్డించింది. తడి పొడి మాటలతో భోజనాలు ముగిసాయి. మామూలుగా అయితే భోజనాలబల్ల ముందు వేలవేల కబుర్లు పోగయ్యేవి.

భోజనమయ్యాక... "అమ్మా నేను కెమిస్ట్రీ క్లాస్‌కి వెళుతున్నాను..." అని వింధ్య చెప్పింది.

"ఏం ఇవాళ కొత్తగా వెళ్తున్నావా అంతలా అరిచి చెబుతున్నావ్... కాస్త మెల్లగా మాట్లాడ వచ్చుగా..." అరిచింది పునీత.

సమ్మెట ఉమాదేవి

## అమ్మంటే...!

అమ్మంటే...
తేనె తేటల పాల ఊట
అమ్మంటే...
గోరుముద్దల లాలిపాట
అమ్మంటే...
చిరునవ్వుల పూలతోట
అమ్మంటే...
జాబిల్లిలోని పాలవెల్లి
అమ్మంటే...
కడలిలో కల్పవల్లి
అమ్మంటే...
తొలకరి చిగురుల ఆమని
అమ్మంటే...
పరమపూజ్య పావని
అమ్మంటే...
కారుణ్య కారిణి
అమ్మంటే...
సుమధుర భాషిణి
అమ్మంటే...
పచ్చదనంలోని వెచ్చదనం
అమ్మంటే...
మమకారపు మాధుర్యం
అమ్మంటే...
ప్రేమామృత భాండం
అమ్మంటే..
నిత్యజీవన సత్యం
అమ్మంటే...
విశ్వానికి నేపధ్యం
అమ్మంటే...
ఓంకార నాదఝుంకారం
అమ్మంటే...
అద్వైతాకారం
అమ్మంటే...
ప్రకృతికి పరిపూర్ణాకృతి
అమ్మంటే...
సకల చరాచర సృష్టికి మూలం
అమ్మ...
నడయాడినచోట బృందావనం
అమ్మకు
శతసహస్రాభివందనం

ఎస్.ఎం.సుభాని

కళ్ళలో నీళ్ళు తిరిగాయి వింధ్యకు. ''నేను ఎప్పటిలాగే చెప్పానమ్మా... అరవలేదు...'' బేలగా అంది.

పునీత లోనికి వెళ్ళిపోయింది. ఛ... ఛ.. రాను రాను ఎందుకిలా తయారవుతున్నాను... ఏనాడైనా వింధ్యను విసుకున్నానా పాపం వింధ్య కళ్ళనీళ్ళు పెట్టుకుంది... బాధపడుతూ పనులలో మునిగిపోయింది. అంతా గమనిస్తున్న మాధవ్‌కి అయోమయంగా అనిపించింది. మాధవ్‌కి గతమంతా మదిలో మెదిలింది.

❖ ❖ ❖

తమ పెళ్ళయిన కొత్తలో పునీత ముద్దమందారంలా ఉండేది ముగ్ధ సౌందర్యమే కాదు మూగగా ఉండేది. మాట్లాడు ''పునీత ఏమైనా కబుర్లు చెప్పు చిన్ని...'' అంటూ వెంటపడితే ముత్యాలు రాలినట్లు నవ్వేది. తను మాట్లాడే చిన్ని చిన్ని మాటలను విని పులకరించిపోయేవాడు. మాధవ్ బహుశా ఆరేడు నెలల తరువాత అనుకుంటా... కాస్త చొరవగా మాట్లాడడం ప్రారంభించింది. అంతలోనే ఇంట్లో అన్నా వదినలమధ్య గొడవలు ప్రారంభమయ్యాయి... చాలా చిన్న చిన్న విషయాలకే... పెద్ద పెద్దగా గొంతేసుకుని వాళ్ళిద్దరు అరుచుకుంటే దడిచిపోయేది... తమ గదిలోకి వచ్చి మాధవ్‌ను అల్లుకుపోయేది.

''ఏమండీ మీకెపుడైనా నామీద కోపం వస్తే... అలా

## అటూ ఇటూ!

అమ్మ గర్భం నుంచి
అందరిలాగానే నేనూ
ఏడుస్తూనే ఈ లోకంలోకి ప్రవేశించాను
ఆ క్షణం
అమ్మానాన్నలకి
అంతులేని ఆనందం కలిగింది
ఆ తర్వాత
నన్ను పెంచి
నేను జీవితంలో స్థిరపడడానికి
వారు పడిన శ్రమ, తీసుకున్న శ్రద్ధ
ఎన్నని చెప్పను ఏమని చెప్పను
కుటుంబ పోషణే కష్టమయినపుడు
అప్పుచేసి పోషకాహారం ఇచ్చారు
చదువుల తల్లి ఒడిలో నన్ను కూర్చోపెట్టి
తలలు తాకట్టుపెట్టి
నన్ను డిగ్రీల మెట్లు ఎక్కించారు
కళ్ళముందు కనిపించే
తల్లిదండ్రుల ప్రేమకన్నా
దూరపుకొండల అయస్కాంతపు ఆకర్షణకి
లోయ్యాను
'అ' అంటే అమ్మకాదు అమెరికా అని తెల్చుకున్నాను
అమ్మానాన్నలుసమకూర్చిన రెక్కలతో
ఎగిరిపోయాను
ఈసారి ఆనందం నాది
కన్నీళ్ళు అమ్మానాన్నలవి!!

**బోడపాటి కృష్ణవేణి**

చేయకు చిన్ని ఇలా ఉండు పునీత అని నిదానంగా చెప్పండి కాని బావగారిలా మాత్రం నాపై ఎప్పుడూ అరుస్తూ దెబ్బలాడకండీ...'' అనేది పునీత.

''నీమీద నాకు కోపం ఎందుకొస్తుంది బంగారు...మా పునీత చాలా మంచమ్మాయి కదా...'' అనేవాడు మాధవ్.

''కాదు పెద్ద గొంతేసుకుని అరుస్తూ తిడుతూ ఇలా ఎప్పుడూ ప్రవర్తించనని మాటివ్వండి'' అనేది.

''అలాగే తల్లీ'' అంటూ ఆమెను దగ్గరకు తీసుకునే వాడు.

''మనమూ మనుష్యులమేనండి... మనకీ కోపాలు అసంతృప్తులు అలజడులూ ఉంటాయి. కాని అక్కసుతో ఆవేశంగా అరుచుకుంటూ ఒకరినొకరు దూషిస్తూ నిందిస్తూ... పోట్లాడుకుంటుంటే ప్రశాంతత పోయి ప్రళయ వాతావరణం నెలకొంటుంది.... అందుకే మనిద్దరం ఓ ఒప్పందానికి వద్దాం నాకు మీమీద కోపం వస్తే నేను మౌనంగా ఉంటాను... దాన్నిబట్టి మీరు అర్థం చేసుకోవాలి...'' అన్నది పునీత.

''అలాగేలే... దేవిగారి కోపం పోయి అలక తీరాలంటే మేము చీరలుపెట్టాలా సారెలు తేవాలా. అదీ చెప్పాలి... మరి'' మాధవ్ అనేవాడు అల్లరిగా.

''ఏమీ వద్దు. నాకు కాస్త సమయమిస్తే చాలు నేను సర్దుకుపోతాను. మీకు కోపం వచ్చినా అంతే... మీరు కాస్త మౌనం వహిస్తే ఆ మౌనాన్ని అర్థంచేసుకుని మీ ముందు మోకరిల్లి లెంపలేసుకుంటాను...'' అంతకంటే అల్లరిగా నవ్వేది.

''అక్కరలేదు ఇష్టంగా దగ్గరకు తీసుకుని అడిగినవన్నీ ఇచ్చేస్తే... చాలా కోపమంతా ఎగిరిపోతుంది సరేనా...'' మాధవ్ అనేవాడు.

''అడిగినవన్నీ పొందేందుకు అస్తమానం అలగ కూడదు మరి'' అనేది హాయిగా నవ్వుకునే వారిద్దరూ.

అన్నమాట ప్రకారం ఎంత విసుగులు కోపాలు ఆవేశాలు వచ్చినా అసంతృప్తులు రేగినా పోట్లాటలు లేకుండా ఇన్నేళ్ళు అన్యోన్యంగా కాపురం చేశారు. పిల్లలు కూడా అదే శాంతం అణకువ నేర్చుకుని ఇంటిని ప్రశాంతి మయం చేశారు... దానికి కారణమైన పునీత అంటే అందరికి అంతులేని అనురాగం కాని ఇపుడేమిటి పునీతిలా తయారైంది.

❖ ❖ ❖

ఆ రాత్రి ఏదో అలికిడైతే ఉలిక్కిపడి లేచాడు మాధవ్. పునీత దుప్పట్లు చుట్టి ఓ మూలకు విసిరికొట్టింది. వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చింది. చాలా నీరసంగా అలసటగా కనిపించింది.

''ఏంటి పునీత మళ్ళీ అలాగే అవుతుందా నీకు...'' అడిగాడు.

''అవునండి ధారాపాతంగా అవుతున్నది...'' ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి...

## ప్రేమను కాపాడండి!

కళాశాల అంటే...
ఒక అందమైన విద్యా ఉద్యానవనం!
ఎన్నెన్నో సుమబాలలు వెల్లివిరిసే
పసిడికాంతుల బృందావనం!
సరస్వతీ దేవి నృత్యం చేసే
లయల సిరుల కళామందిరం!
జ్ఞానపు యేరులు పారే
విజ్ఞాన సముద్రం!
నేడు
వసంతాలు రాలిపోతున్నాయి...!
కళామందిరం లయ తప్పింది...!
జ్ఞాన సముద్రం విషమెక్కింది...!
శ్రుతితప్పిన ఆవేశంతో
యువ గళాలు కొన్ని మృగాలు అవుతాయి!
కళాశాల రక్తసిక్తం...!
తనకు దక్కని శ్వాస ఆగిపోవాల్సిందే అని
యాసిడ్ పోసి, పీకలు కోసి
యువకులు ప్రేమోన్మాదులుగా మారుతున్నారు.
ప్రేమ ఒక అమృత తీరం...!
ప్రేమ చరిత్ర
ఒక త్యాగాల సంపుట...!
ప్రతి పేజీలో, ప్రతి అక్షరంలో
మమకారం ధ్వనించాలి!
''ఒకరికి ఒకరం నువ్వు నేను'' అనే
గుండె చప్పుడు వినిపించాలి!
నేడు ప్రేమకు అర్థం మారింది!
ఆస్తులు, అతస్తులు చూసి పుట్టేది ప్రేమే!
అలంకారాల ఆకర్షణా ప్రేమే!
రక్తపు మడుగుల్లో, ఆకర్షణ లోయల్లో పడి
ప్రేమ కొట్టుకుపోతుంది కాపాడండి!!

**భారతీయుడు**

''మాత్రేమైనా వేసుకుంటావా... కాస్త పాలుకలుపుకు రానా...? ముందు నువ్వలా కాస్త విశ్రాంతిగా పడుకో...''

''ఏం విశ్రాంతో ఇలాంటి బట్టలు పనివాళ్ళు ఉతకరు ముందు నేనే వెయ్యను... మూడు నాలుగు రోజులుగా నా పని ఇలా లంగాలు... దుప్పట్లు చీరెలు ఉతకడమే... అసలే కడుపులో నడుములో నెప్పి...'' ఆపై... అంటూ ఏడ్చేసింది.

ఆ మాత్రం మనస్సు విప్పి మాట్లాడినందుకు తన బాధేంటో చెప్పుకున్నందుకు మాధవ్ మనసు కాస్త తెరిపినపడింది.

''ఇపుడాబట్టలు ఉతకడానికి తొందరేం వచ్చింది అవసరమైతే నేనో వింధ్యో ఉతికేస్తాం సరేనా...''

''ఛా... చా... మీతో ఉతికిస్తానా...?''

''మేమేం కందిపోంగాని నాప్‌కిన్‌లకు కూడా ఆగనంత పరిస్థితి వచ్చినా అలా చెప్పకుండా భరిస్తావేం. రేపే మనం డాక్టర్ దగ్గరకు వెళ్తున్నాం సరేనా...?''

''వెళ్తే ఎక్కడ ఆపరేషన్ అంటుందేమోనని భయం వేస్తుందండి... మీ వదినకు ఇలాగే అయితే గర్భసంచి తీసేశారు గుర్తుందా...!''

''అన్నీ నువ్వే ఊహించుకుంటే ఎలా పునీత... ముందు మనం డాక్టర్ దగ్గరకు వెళ్తున్నాం అంతే...''

''సరేనండి...'' పునీత అన్నది.

మాధవ్ ఇచ్చిన వేడి వేడి పాలు తాగి అలసటగా పడుకుంది.

మర్నాడు మాధవ్ వినయ్ కలిసి పునీతను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళారు... అన్నిరకాల పరీక్షలు చేయించారు డాక్టరిచ్చిన మూటెడు మందులు తెచ్చుకున్నారు... దగ్గ రుండి వింధ్య వినయ్ తల్లికి సమయానికి మందులు వేశారు. పునీత విసుక్కుంటున్నా లెక్కచెయ్యక పళ్ళు, మంచి ఆహారం అన్నీ ఇచ్చారు. కాస్త కోలుకుంది పునీత.

కాని చిత్రంగా మరో నెలా పదిహేనురోజుల తరువాత మళ్ళీ అతిగా ప్రవర్తించసాగింది... కొత్తగా ఈసారి ప్రతీ చిన్నదానికి ఏడుపు లంకించుకుంటున్నది.

మాధవ్ అడిగాడు... ''మళ్ళీ అధికంగా అవు